"నిన్న బియ్యం అయిపోయాయి. కిరసనాయిలు కూడా లేదు. రాత్రి అన్నం వండలేకపోయాను ఆ సంగతి చెపితే మీరు బాధపడారని, కంటతడి పెడతారని తెలిసి, మీ చేత అన్నం తినను అనపించాలని అలా అరిచానంతే."

కుచేలరావు భార్య మొహంలోకి చూశాడు ఆశ్చర్యంగా, ప్రశ్నార్థకంగా_

"అవును రాత్రి పూలు గిన్నెలో వేసి నీళ్ళు చల్లి మూత పెట్టాను చూడండి వాడిపోకుండా ఎలా వున్నాయో? ఇప్పుడే కోసిన వాటిలాగా" తలలోని పూలచెండుని చూపించింది కుచేలరావు భార్య.

ఆయన కళ్లు చెమర్చాయి. వంగి భార్య నుదుటిమీద సుతారంగా ముద్దు పెట్టుకున్నాడు.

## పెట్టుడు చీర

కల్పకం ఒక్కతే చెల్లెలు నరహరికి.

ప్రతిఏడు దీపావళి పండుగకి పిలిచి, కల్పకానికి ఒక చీర, జాకెట్టు, పండు, తాంబూలం పెట్టడం గత అయిదేళ్లుగా నరహరికి అనవాయితీగా వస్తోంది.

కల్పకం, నరహరుల తండ్రిపోయి అయిదేళ్ళయింది. తన తండ్రి స్వర్గస్తుడయినప్పటినుంచీ, ఆయన బాధ్యత తనమీద వేసుకుని తన శక్తి వున్నంతలో చీర, జాకెట్టు పెడుతున్నాడు నరహరి చెల్లెలకి.

ఆడపిల్ల కాబట్టి, అన్నయ్యనుంచి ఖరీదయిన చీర ఆశించడంలో కల్పకం తప్పులేదు. నరహరి పెద్ద వుద్యోగస్తుడు. చన్నీళ్ళకు వేణ్నీళ్ళు తోడన్నట్లుగా నరహరి భార్యకూడా ఉద్యోగం చేసి నాలుగొందలదాకా సంపాదిస్తోంది.

సంపాయించటంలోని కష్టం తెలుసు కల్పకం వదినకి. స్వతహాగా కొద్దిగా పిసినారి కూడా. ఏటేటా తన భర్త కల్పకానికి ఖరీదయిన చీరెలు పెట్టడం ఆవిడకి నచ్చలేదు. నోటితో లేదనేబదులు, చేతితోనే లేదు అంటే మంచిదనే అభిప్రాయంతో, భర్త యిష్టాన్ని తిరస్కరించడానికి మనస్కరించక, యీసారి తనే కల్పకానికి పెట్టే చీర చవకలో కొనుక్కొచ్చింది.

ప్రతీఏడు పెట్టే చీర ఖరీదులో నాలుగోవంతు ఖరీదుచేసే, మామూలుగా ఇంట్లో వాడుకునే కట్టుడుచీర కొనితెచ్చింది. ఆ వాయిల్‌చీర నలభై రెండురూపాయల తొంభై ఐదు పైసలు ఆ తోపురంగుచీరకిజతఅయ్యే జాకెట్టు ముక్క గూడా అయిదు రూపాయలకి కొన్నది.

ఎప్పటిలానే చెల్లెలిని, బావని పండగకి పిలిచాడు నరహరి. ఆమె తన ఇంటికి వెళ్ళబోయేముందు బొట్టుపెట్టి, ఆ వాయిల్‌చీర, జాకెట్టు పెట్టారు. వాటిని చూడగానే కల్పకం మొహంలో పొడసూపిన రోషం, అసంతృప్తి గమనించి చెప్పింది నరహరి భార్య.

"ఏం అనుకోకు కల్పకం! యీసారి అట్టేమంచి చీర పెట్టే స్థితిలో లేము. మొన్న డాక్టర్ బిల్లుకి నాలుగయిదు వందలదాకా అయింది.... ఇంట్లో కట్టుకోడానికి నీకు నాలుగే చీరలున్నాయి అందులో అయిదారుంటే మన్నుతాయి. వచ్చే దీపావళికి మంచిచీర పెడతాంలే అమ్మా"

కల్పకం సమాధానం యివ్వలేదు. మౌనంగా వుండిపోయింది.

"పోనీలే వదినా!" అనే జవాబుకోసం ఎదురుచూసిన నరహరి భార్య హతాశయురాలయింది.

"దీనికెంత టెక్కో వూరికే వచ్చేదానికి కూడా" అనుకుంది మనసులో.

వాళ్ళ ఇంటిగడపదాటి, వందగజాల దూరం వెళ్ళాక అన్నది కల్పకం కోపంగా భర్తతో.

"ఈ చీర చస్తే కట్టనీ జన్మలో!"

ఆ చీరని యెలా వదిలించుకోవాలో కల్పకం అక్కడికక్కడే నిర్ణయించుకుంది. వెంటనే దానిని అమలు జరిపింది.

* * * *

"నలభై రెండు రూపాయల తొంభై అయిదు పైసలు అమ్మగారూ, ధర కాగితం చీరకే అంటించివుంది చూసుకోండి."

"మూడుదఫాలుగా ఇచ్చే పద్ధతిలో ఇస్తాను" అన్నది పనిమనిషి.

"నాకు ఇంట్లో కట్టుకోడానికి బొత్తిగా చీరలే లేవు. ఇన్‌స్టాల్‌మెంట్‌లో మంచి చీరలేమయినా వుంటే చూపించు" అని నాలుగు దినాల క్రితం అడిగితే పనిమనిషి ఆచీరను చూపించింది ఆవిడకి.

తోపురంగు వాయిల్ చీర. ఆవిడకి నచ్చిందా చీర! మొదటిదఫా డబ్బు చెల్లించి ఆ చీరను కొనుక్కుని అడిగింది ఆవిడ. ఆవిడ అంటే నరహరి భార్య.

"ఎక్కడిదే ఈ చీర?"

పనిమనిషి సమాధానం చెప్పింది.

"మాలాలీలో మా చెల్లెలు ఓ ఇంటిలో పనిచేస్తోంది! ఆ ఇంటావిడ మా చెల్లెలికి పెట్టింది చీర. ప్రతఏడు దీపావళి పండుగకి పాతికరూపాయల చీర కొనిస్తుందిలేండి. మా చెల్లెలు యింత ఖరీదు చీరలు కట్టదు కాబట్టి నాకు నలభైకి అమ్మింది."

"మాలాలీలోనా? ఎవరే ఆవిడ? కొంపతీసి కల్పకం కాదుగదా?" అనుమానంగా అసహనంగా అడిగింది నరహరి భార్య.

"కల్పకం అమ్మగారు మీకెలా తెలుసండీ? విస్మయంగా అడిగింది పనిమనిషి, నరహరి భార్యని.